# అక్కయ్య కావాలి!

నేనిప్పుడు మూడో తరగతి చదువుతున్నాను. కిందటేడు రెండో తరగతి చదివే వాణ్ణి. ఏడాదినించీ ఒక అక్కయ్యను సంపాదించాలని ప్రయత్నిస్తున్నాను. మరి—అక్కయ్య లేకపోతే యెలా చెప్పండి? అక్కయ్య వుంటే ఎంచక్కా కలిసి బళ్ళోకి వెళ్ళొచ్చు. మళ్ళా సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి రావొచ్చు. ఒకవేళ ఎవరయినా నేస్తాలు నాతో దెబ్బలాడేరనుకోండి ఓ వేళ నా కంటే కొంచెం పెద్ద వాళ్ళయితే నా నెత్తిమీద ఒక మొట్టికాయ మొట్టారనుకోండి. అప్పుడు అక్కయ్య గనుక వుంటే వాణ్ణి నాలుగు తన్ని "ఒరే తమ్ముడూ నిన్ను తన్నేడా వాడు. మస్టారితో చెప్పానులే!" అని చెప్పి నా కళ్ళు తుడిచేసి ఒకవేళ యేడుద్దామనుకున్నా యేడవనివ్వదు. యేమంటారు? ఇంకాచెప్పాలంటే బోల్డు లాభాలున్నాయి అమ్మ విసుక్కొని తల దువ్వలేదనుకోండి దబ్బున నా తల చేత్తో పట్టుకొని ఒక దెబ్బన దువ్వేస్తుంది. నాకేమో తల్దువ్వుకోవడం రాదాయె సెలవలలో నేర్చుకుంటా యింకో ముఖ్యమయిన లాభం ఏమిటంటే సాయంత్రమయినప్పుడు యింటికొచ్చి ఆడుకోవచ్చు. మరి నాకు ఒక తమ్ముడున్నాడు. అసలు నేనే బుళ్ళివాణ్ణంటే వాడు నాకంటే బుల్లివాడు ఇప్పుడు వాడికి రెండో యేడుట. యింట్లో యింట్లో నడుస్తున్నాడుగాని వాడికేం ఆడుకోవడం రాదు. మాటలుకూడా నత్తిగా మాట్లాడతాడు. యింకేలాభం చెప్పండి మరినాకు వాడితో—..ఇకపోతే వొక అన్నయ్య వున్నాడు. అతనేమో నన్ను అప్పుడప్పుడూ మొట్టికాయలు మొడుతుంటాడు. అన్నయ్యా ఆడుకుందామా అంటే "ఛీ నోర్ముయ్, పోయి చదువుకో" అని వాడేమో మేడమీద నిలబడి దారేపోయే అమ్మాయిలకేసి చూసి ఈల వేస్తుంటాడు. సరేలెండి....

ఒకసారి మా అమ్మతో "అమ్మా నాకో అక్కని సంపాదించి పెట్టవుటే" అన్నాను అప్పుడేమో అమ్మ గబ గబా ఏడ్చేసింది. "అయ్యో నా చిట్టి తండ్రీ నువ్వు చిన్న కుర్రాడిగా వున్నప్పుడే మీ యక్క చచ్చిపోయిందిరా యీ పాటికి పది పన్నెండేళ్లుండేవి దానికి. బంగారుతల్లి నిన్ను ఆడించేదిరా. జబ్బుచేసి చచ్చిపోయింది—నువ్వు రెండేళ్ళకుర్రాడిగా వున్నప్పుడు" అంటూ నోటికి చీరడ్డంపెట్టుకొని యేడ్చింది. "పోన్లేమ్మా ఊరుకో యేడవడం యెందుకు. మేష్టరు తంతే ఏడుస్తారు—లేకపోతే నాన్న కొనుక్కుందికి కాణీ గాని అణాగాని ఇవ్వకపోతే ఏడుస్తారు—అంతేకాని చచ్చిపోతే ఎక్కడయినా ఏడుస్తారా. [చచ్చిపోవడం నాకు తెలీదనుకోండి]—నువ్వూరుకో పోనీ ఒక అక్కయ్యను నేనే యేలాగయినా సంపాయిస్తానుగా" అన్నాను. అప్పుడేమో అమ్మ నవ్వేసి దగ్గరకి తీసుకుని నన్ను ముద్దెట్టుకుంది.

మా బళ్ళోపిల్లందరికీ అక్కలున్నారు. పోనీ చెల్లెళ్ళయినావున్నారు. ఎంచక్కా కలసి బళ్ళోకొస్తూఉంటారు—వెళ్తుంటారు—ఆడుకుంటూరు. వాళ్ళని చూసినప్పుడల్లా, ''హయ్యో! ఒక్క అక్కయ్యేనా లేదే?'' అనిపించి ఏడుపొస్తుంది.-కాని యేడిస్తే ఏం లాభం? ఏడిస్తే బాబూ ఏడవకురా అని బెల్లంముక్కో బఠానీలో ఇస్తారుగానీ అక్కయ్య నివ్వరుకదా....

ఒకసారి ఏం జరిగిందంటే ఒక అక్కయ్యను ఒకమ్మాయిని,సంపాయించేను. ఆయమ్మాయేమో నాకంటా చిన్నదుంటుంది. వుంటేయేంగాక....' నేను రోజూ మా ఇంటినుంచి తాయిలాలూగట్రా తెచ్చియిస్తుంటాను. నిన్ను అక్కయ్యా అ పిలవనిస్తావా" అనడిగాను, యింటర్వెల్లో ఎవరూలేకుండా చూసి. ఆ యమ్మాయి క్కూడా తమ్ముళ్ళుగాని అన్నయ్యలు గాని లేరట. ''పోనీ యేంపోయింది. నేనే నీ తమ్ముణ్ణనుకో. ఎంచక్కా ఎంతబావుంటుంది .. మరి నువ్వప్పుడప్పుడూ ఆడు కోడానికి వప్పుకుంటుండాలి. మా ఇంటికూ్కడా వచ్చి కాస్సేపుండి పోతుండాలి మరి'' అని ముందే చెప్పేశాను. యెప్పుడయినా అన్నయ్య జేబులోంచిగాని అమ్మ కొంగుకుకట్టుకుని నిద్రపోయినప్పుడుగాని డబ్బులు సంపాయించియిస్తానన్నాను సరేనిన వొప్పుకుంది. ఓ రోజు యెంచక్కా ఇంటికి తీసుకొచ్చేను.''అమ్మా నువ్వే డిచావు అప్పుడెప్పుడో, అక్కను సంపాయించమంటేను. చూ స్కో అక్కయ్యను సంపాయించేశాను'' అంటూ అమ్మకి చూపించాను. చూసి నవ్వింది. "వొరే ఎక్క డయినా చిన్నపిల్లని అక్కయ్యంటారా? నీ తెలివి మండినట్టేవుంది" అన్నది కిత కితలు పెట్టినట్టునవ్వి. అబ్బే ఈ పెద్దవాళ్ళెప్పుడూ యింతే. కిత కితలు పెట్టకుం డానే నవ్వుతుంటారు ఎట్లా వస్తుందో యేమో యింకేం జేసేది? రెండో్రిలలాపిలిచి ఆ తరువాత మళ్ళా మానేశాను. అక్కయ్యయితే పెద్దదవాలని నాకేం తెలుసు?

అబ్బబ్బ! మీకు తెలీదుగానీ అక్కయ్యనేది వొకతె వుండకపోతే యెన్ని నష్టాలున్నాయో నాకెప్పుడైనా చదవడం రాపోతే దగ్గిరుండి చదివించడానిక్కూడా అక్కయ్య లేదాయె. యింకెలాగమరి? ఒకసారన్నయ్య తప్పు నేను చదువుతుంటే వొచ్చి ఒక మొట్టికాయ మొట్టి "వెధవాయ్ సరిగా చదువ్"అంటూ మళ్లా ఎటో వెళిపో యేవాడు. ఒకసారి నేను పుస్తకాన్నడ్డు పెట్టుకొని ఏడిచానుగాని ఒక్కరూ "బాబూ యాడవకురా" అన్లేదు. యేంజేసేది చివరికి నా మట్టుకు నేనే వూరుకున్నాను. మరి ఇలాటప్పుడు అక్కయ్యవుంటే యంతబావుండేది.... తమ్ముడేమో తప్పటడు గులు వేసుకుంటూ వెళ్ళి లక్కపిడతలు గట్రా నీళ్ళబిందెల్లో పడేసేవాడు. లేపోతే ఇల్లెగిరిపోయేలా బొయ్‌మని యేడిచేవాడు. అప్పుడయితే మాయమ్మ ఖాళీగా లేక పోతే మా నాన్నగారు నన్ను తన్ని "వెధవా! కాస్సేపాడించు తమ్ముణ్ణి" అనే వారు వాణ్ణి యెత్తుకోవడం రాదుమరి. ఒకసారి యెలాగో తంటాలుపడి ఎత్తుకుంటే

నేమో వాడే వొళ్ళు విరుచుకున్నాడు. కిందపడిపోయాడు బుర్రిరింగుమంది అప్పు డుగూడా మా యమ్మ నా చెవి మెలి పెట్టేసింది మరట్లాంటప్పుడక్కయ్య గనక వుంటే యెంత బావుండేది. వీటికి మాటికీ యీ తన్నులు తప్పేవిగదా. తన్నులు మాటెలావున్నా—ఎంతబావుండేది? మీకు తెలీదేమోగాని అన్నయ్యలయితే తంతా రుగాని అక్కయ్యలస్సలు తన్నరు. నిజం! నేనెక్కడా చూళ్ళేందే....

మా తమ్ముడు నిద్రపోకపోతే మాయమ్మ జోలపాడేది. చాలా బావుండేదా జోలపాట. యంచక్కా జోజో అంటూ జోకొట్టేది. నేనొకసారి నిద్రరాకపోతే "అమ్మా యీవాళ జోలపాడవా" అన్నాను. "వోరి వాజమ్మా దున్నపోతులాగ నీకు జోలే మిటా్రి" అన్నది. నాకు జ్ఞాపకం వుండగా యెప్పుడూ అమ్మనాకు జోలపాళ్ళేదు. నేను బుల్లివాణ్ణిగా వునప్పుడు పాడేదిట! అప్పుడు నాకేం తెలుసు. తెలిసినప్పుడు పాడితే సంతోషిస్తానుగాని తెలీనప్పుడు పాడితేనేం పాడక పోతేనేం? నా కెన్నా ళ్ళనుంచో సరదాగా జోలపాడించుకోవాలనుంది. అక్కయ్యుంటే పాడేది.

అమ్మేమో తమ్ముడికెంచక్కా వెండిగిన్నెలో అన్నం తినిపిస్తుంది. నాకయితే నేమో మాములుగా కంచంలోపెడుతుంది. వెండిగిన్నెలో చస్తే పెట్టదుగద? నాకె వరయినా అన్నం తినిపిస్తే బావుణ్ణనిపిస్తుంది. యింకెవరు తినిపిస్తారుమరి?

"ఓసారి వుండలేక నాన్నతోకూడా చెప్పేశాను.నాకక్కయ్య వుంటేబావుణ్ణని. "చెల్లెలయినా తమ్ముడయినా కావలిస్తే రావడానికవకాశం వుందిగాని అక్కనెక్క ణ్ణుంచి తెచ్చేదిరా" అంటూ అమ్మకేసి చూసి నవ్వేరు. చెప్పానుగా—పెద్దాళ్ళు వుత్తినే నవ్వుతారెందుకో తెలీదు. వుత్తినే నవ్వితే నాకు చెప్పలేని చిరాకొస్తుంది.

మరేమో చెప్పడం మరిచిపోయాను-మొన్నోసారి నా కంటే పెద్ద అక్క య్యనే సంపాయించేను. యింటికి తీసుకొచ్చేను. అమ్మచూడకుండా యెప్పుడయినా జోల పాడటానికి కూడా వొప్పుకుంది. హోయ్ హోయ్ బలేలనుకున్నాను. కాని ఏం జరిగిందంటే వోసారి—ఆయమ్మాయిని, మా యమ్మ "మీరేమిట్లు?" అనడిగింది. మర్చిపోయానుగాని ఆయమ్మాయేదో చెప్పింది. అప్పుడేమో అమ్మ నా వీపుమీద ఒక్క చరుపు చరిచి "వెధవ లోపలికెళ్లు. ఆ పిల్ల నీకక్కవుతుందా. తొక్కవొలి చేస్తాను. యావనుకుంటున్నావో" నని-వెళ్ళు "వెళ్ళు మీ ఇంటికి. మరోసారి ఇక్క డికి రావడంగాని, మా వా డి తో తిరగడం గాని చేశావా(ఆ(!" అంటూ వెళ్ళ గొట్టింది పాపం ఆ పిల్ల భయపడి వెళిపోయింది. ఆ మర్నాడు బళ్లోకెళ్ళినప్పుడు "అక్కయ్యా! యేమనుకోకు మా యమ్మ యెప్పుడూ అంతేనన్నాను ఏడుస్తూను "ఆ యేడిశావ్లే! మీ యమ్మ నన్ను తంతుందట! యిక నీకు అక్కయ్యా లేదూ

గాడిదగుడ్డూలేదు. కావలిస్తే మొన్న నువ్వు నా కిచ్చిన అణాకాసు యింద తీసుకో మరి నన్ను అక్కయ్యాని మాత్రం పిలవకు" అంది. యింకేం చేసేది బళ్లో ఏడిస్తే మేష్టారు తంతారని యింటికొచ్చి ఎవరూ చూడకుండా ఏడ్చాను....ఏమిటయితే అమ్మ కెందుకంట? యేం వొస్తుందందువల్ల? యేమో బాబూ. ఈ పెద్దాళ్ళెప్పుడూ ఇంతే, లేపోతే యంచక్కా అక్కయ్య వొచ్చును. చెడగొట్టారు. మరందుకే మొన్నట్నించీ కూడా పెద్దాళ్ళంటే అసయ్యం వేస్తోంది. ఆమెను అక్కయ్య అని పిలుస్తే ఏంపోయింది చెప్పండి మీరయినా? మా యమ్మకు కూడా చిన్నప్పుడు—నాకు మల్లేనే అక్కయ్య లేపోతే తెలిసేది....

మీరు ఎన్నటూ చెప్పండి. మరినాకు అక్కయ్య దొరుకుతుందని నమ్మకం లేదు. అయినా ఎలాగయినా సంపాయిస్తాననుకోండి. మీరుగూడా కాస్త సాయం చెయ్యాలిమరి....జ్ఞాపకం వుంచుకోండి....

రచన ; 13–5–1961-ప్రచురణ : బాలబంధు 1-1-1962